క్లుప్తంగా

ముమ్మరంగా సీసీ రోడ్డు నిర్మాణం



ఎమ్మిగనూరు 7వ వార్డులో సీసీ రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని పలు వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. 7వ వార్డులో రూ.7 లక్షలతో రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు వార్డు ఇన్‌చార్జ్ శివసూర్యనారాయణ సోమవారం తెలిపారు. గతంలో రూ.16 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయిందని పేర్కొన్నారు. వార్డులో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టిన ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డికి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

16 నుంచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

ఆలూరు రూరల్: మండలంలోని మొలగవల్లి గ్రామంలో కొలువైన చెన్నకేశవ స్వామి రథోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. ఆసక్తి గల జట్లు 15వ తేదీలోపు రూ.550 చెల్లించి పేరు నమోదు చేయించుకోవాలన్నారు. 16, 17 తేదీల్లో పోటీలు ఉంటాయని వెల్లడించారు. విజేతలకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సహకారంతో రూ.51 వేలు, రెండో బహుమతి ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ నారాయణ రూ.25 వేలు, మూడవ బహుమతి గ్రామ వైఎస్సాసీపీ నాయకుడు హరేరామ్ తిక్కన్న రూ.10,116, నాలుగవ బహుమతి రూ.5,116 వాల్మీకి నాయకుడు లోకేష్ సహకారంతో అందించనున్నట్లు చెప్పారు. గ్రామానికి చెందిన బోయ చిట్టిన్న సహకారంతో క్రీడాకారులకు ఉచిత భోజన వసతి ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. వివరాలకు 90141 55679, 77807 98441 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఉరుకుందకు తరలిన మాలధారులు



ఇరుముడి కట్టుకుని బయల్దేరుతున్న మాలధారులు

పత్తికొండ రూరల్: 41 రోజుల మండల దీక్ష పూర్తి చేసుకున్న 18 మంది మాలధారులు సోమవారం కౌతాళం మండలం ఉరుకుంద ఈరన్న స్వామి సన్నిధానానికి బయలుదేరారు. ముందుగా స్థానిక తేరుబజారులోని పురాతన వీరభద్రస్వామి దేవాలయంలో గురుస్వామి నాగేష్ మాలధారులకు ఇరుముడి కట్టారు. అనంతరం పాతపేట నుంచి ప్రధాన రోడ్డులో ఈరన్న నామస్మరణతో బాటసవారమ్మ ఆలయం వరకు భక్తులు ప్రదర్శన చేశారు. అనంతరం వాహనాల్లో బయల్దేరిన మాలధారులను గ్రామస్తులు సాగనంపారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



రిటైర్డ్ ఐఆర్ఎస్ గగారియన్

ఆలూరు రూరల్: పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని బెంగళూరుకు చెందిన రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి గగారియన్ సూచించారు. ఆయన సోమవారం ఆలూరు గిరిజన ఆశ్రమ బాలికలు, బాలుర పాఠశాల విద్యార్థులకు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు ఎలా సాధించాలన్న అంశంపై సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. తరగతిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను ఎప్పటికప్పుడు చదువుకోవాలన్నారు. భయం వీడి ధైర్యంగా పరీక్షలు రాస్తే విజయం వశమవుతుందన్నారు. క్రమ పద్ధతిలో చదివితే పరీక్షలలో ప్రతి ప్రశ్నకు సమాధానం రాయడం సులువు అవుతుందని వివరించారు. పాఠశాలలోని సౌకర్యాలను ఉపయోగించుకుని బాగా చదివాలని విద్యార్థులకు సూచించారు. హెచ్ఎం జమ్మన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

ఆలూరు: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులచే ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించేందుకు ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆలూరు హౌసింగ్ డీఈ ఆదినారాయణ ఆదేశించారు. దేవనకొండ మండలం గుండ్లకొండ, పెద్దకోట కొండ, నల్లచెల్లిమల గ్రామాల్లోని జగనన్న కాలనీలను ఆయన సోమవారం పరిశీలించారు. గృహ నిర్మాణాలను పరిశీలించి వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం స్థానిక డీఈ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఆలూరు, ఆస్పరి, హాలహర్వి, హొళగుంద మండలాల్లో దాదాపు 90 లేఅవుట్లలో 5800 మంది లబ్ధిదారులకు గృహాలు మంజూరయ్యాయన్నారు. వీటిలో ఇప్పటివరకు 2300 గృహాలు పూర్తయినట్లు చెప్పారు. హాలహర్వి మండలం టి.చాకిబండ గ్రామ సర్పంచ్ బోయ ఒబులపతి థర్డ్ పార్టీగా 20 గృహాల వరకు పూర్తి చేయించారని డీఈ ఆదినారాయణ చెప్పారు. వర్కు ఇన్‌స్పెక్టర్లు గృహ నిర్మాణలు వేగవంతం చేయడంపై దృష్టి పెట్టాలన్నారు

దివ్యాంగుల సంక్షేమానికి కృషి



దివ్యాంగ మహిళకు ఉచితంగా కుట్టుమిషన్ అందిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

కృష్ణగిరి: దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ధైర్యంగా ముందుగా సాగాలని, వారి ఉన్నతికి తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సెక్రెడ్ స్వచ్ఛంద సంస్థ, వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల పల్లవి, మార్గదర్శి వికలాంగ సమాఖ్యల ఆధ్వర్యంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల వారోత్సవాలు నిర్వహించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే, అతిథుల చేతుల మీదుగా పలువురు దివ్యాంగులకు ప్రోత్సాహక చెక్కులు, కుట్టుమిషన్లు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండల సమాఖ్య భవనాలకు 5 సెంట్ల స్థలం, దివ్యాంగులకు ఇంటి స్థలం, గృహం మంజూరుకు కృషి చేస్తానన్నారు. దివ్యాంగ మహిళా సంఘాలకు పథకాల అమలు పక్కాగా చేపడతామన్నారు. ముఖ్య అతిథులు ఎంపీపీ కంగాటి వెంకట్రామిరెడ్డి, జెడ్పీటీసీ కేఈ సుభాషిణి మాట్లాడుతూ.. దివ్యాంగుల సంరక్షణకు పాటుపడతామన్నారు. సెక్రెడ్ సంస్థ డైరెక్టర్ తిప్పన్న మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో 21 మండలాల్లో గ్రామస్థాయిలో 10 వేల మంది దివ్యాంగులతో సంఘాలు, 21 మండల సమాఖ్యలు, 3 జిల్లా స్థాయి సమాఖ్యల ఏర్పాటు జరిగిందన్నారు. ఎంపీడీఓ రామస్వామి, వైకేపీ ఏపీఎం మహేశ్, ఎంపీటీసీ మహాలక్ష్మి, సెక్రెడ్ కోఆర్డినేటర్ శివశంకర్, ప్రగతి, మార్గదర్శి సమాఖ్యల ప్రతినిధులు రాజేంద్ర, రామగిడ్డయ్య, ఈశ్వరయ్య, హనుమంతు, మహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ప్రోత్సహించాలి

గోనెగండ్ల: దివ్యాంగులు మనోధైర్యంతో ముందుకు సాగేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఎస్‌ఐ తిమ్మారెడ్డి, ఎంఈఓలు రామాంజనేయులు, నీలకంఠ సూచించారు. స్థానిక భవిత కేంద్రంలో సోమవారం అంతర్జాతీయ దివ్యంగుల దినోత్సవాన్ని ఉపాధ్యాయులు అనురాధ, నారాయణమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వం పంపిణీ చేసిన ట్యాబ్‌లు, వ్యాపారవేత్త ప్రసాద్ శెట్టి సహకారంతో 30 మంది విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ.. దివ్యాంగులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం వారికి అవసరమయ్యే పరికరాలతో పాటు ట్రై సైకిళ్లను పంపిణీ చేస్తుందని పేర్కొన్నారు. అలాగే వారు సాధారణ జీవితం గడిపేలా వాకింగ్ స్టిక్, కాలిబర్, వినికిడి యంత్రం తదితర పరికరాలను అందజేస్తోందని వివరించారు. గానిగ బాష, మాలిక్ పాల్గొన్నారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో రాణించాలి



బహుమతులు పంపిణీ చేస్తున్న కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: దివ్యాంగులు ఆత్మస్థైర్యం కలిగి ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, ఎంఈఓ 2 మధుసుదన్‌రాజు పేర్కొన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని సోమవారం స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గెలుపొందిన వారికి వారు బహుమతులు, సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ దివ్యాంగుల కోసం ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పట్టణ ఏఎస్‌ఐ కిష్టప్ప, ఖుఈఆర్‌టీలు బాబు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

జగనన్నతోనే పేదల అభ్యున్నతి



ఎమ్మిగనూరులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్ఆర్‌సీపీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగితేనే పేద బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు, రాష్ట్ర అభివృద్ధి కొనసాగుతాయని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, జేసీఎస్ పట్టణ కన్వీనర్ షబ్బీర్‌అహమ్మద్ పేర్కొన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని గిప్సన్ కాలనీ 16వ వార్డు సచివాలయ పరిధిలో వైఎస్సార్‌సీపీ జెండాను, సంక్షేమ పథకాల బోర్డును 18వ వార్డు కౌన్సిలర్ వాహిద్‌తో కలిసి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ పార్టీలు, కులం, మతం చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. మున్సిపల్ మేనేజర్ వరప్రసాద్, కౌన్సిలర్ శివప్రసాద్, పార్టీ నాయకులు మెకానిక్ బాషా, వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



ఎర్రబాడులో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గోనెగండ్ల: సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగనే ముఖ్యమంత్రి కావాలని జేసీఎస్ మండల కన్వీనర్ మనోహర్ రెడ్డి, సర్పంచ్ అరుణజ్యోతమ్మ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఎర్రబాడు గ్రామ సచివాలయం పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డును అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజలను ఓటు అడిగే హక్కు వైఎస్సార్‌సీపీకి మాత్రమే ఉందని స్పష్టం చేశారు. నాలుగున్నరేళ్ల పాలనలో ప్రతిఒక్కరికీ మంచి చేశారని వివరించారు. సచివాలయం పరిధిలో వివిధ పథకాల ద్వారా రూ.25.80 కోట్లు లబ్ధిదారులకు అందించినట్లు చెప్పారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. పంచాయతీ కార్యదర్శి ఉసేన్, వైఎస్సార్‌సీపీ నాయకులు రవీంద్రనాథ్, నరసన్న, రామయ్య, సంజన్న, వెంకట్రాముడు పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం

చిప్పగిరి: స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరిస్తునట్లు తహసీల్దారు లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజలు స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ కొండయ్య, ఎంఈఓ బాలనాయుడు, ఏఓ విజయలక్ష్మి, ఈఓపీఆర్డీ బాలన్న, ఏపీఎం నాగార్జున, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసూన పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్ ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: గత ప్రభుత్వ హయాంలో ఎత్తేసిన ఎస్సీ బాలుర, బాలికల హాస్టళ్లను తిరిగి ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని కోరారు. సోమవారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో పీడీఎస్‌యూ, యూఎస్ఎఫ్ఐ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థి సమాఖ్య, పీఎస్‌యూ నాయకులు రాజేష్, ఉదయ్, శేఖర్‌నాయుడు, సురేష్‌లు కలిసి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. బీసీ హాస్టల్‌కు సొంత భవనం, శిథిలమైన ఎస్సీ హాస్టల్ భవనం పునర్నిర్మించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

'ఆడుదాం ఆంధ్ర' పక్కాగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ దశరథరామయ్య

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమం నిర్వహణలో పూర్తి స్థాయి పారదర్శకత పాటించాలని తహసీల్దార్ నిత్యానందరాజు, ఎంపీడీఓ దశరథ రామయ్య సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 'ఆడుదాం ఆంధ్ర' టోర్నమెంట్‌కు సంబంధించి గ్రామ వలంటీర్లు అంపైరింగ్, పంచాయతీ కార్యదర్శులకు టోర్నమెంట్ నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడా కార్యక్రమం నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ ఈ ఐదు క్రీడాంశాల్లో నిర్వహించే మెగా టోర్నీ తొలుత సచివాలయ స్థాయిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. టోర్నీ నిర్వహణకు మండలంలో 6 మైదానాలను పరిశీలించినట్లు చెప్పారు. అలాగే మాస్టర్ ట్రైనర్లు వెల్ఫేర్ అసిస్టెంట్లకు మ్యాచ్‌ల నిర్వహణ, లైవ్ స్కోరును ఏ విధంగా మొబైల్‌లో అప్‌లోడ్ చేయాలనే అన్ని అంశాలపై శిక్షణ ఇచ్చారు. వలంటీర్లు అంపైరింగ్, నిర్వహణలో ఎలా మెలగాలో వివరించారు. ఈ నెల 15 నుంచి జవనరి 5వ తేదీ వరకు క్రీడా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎంఈఓలు–1, 2 సుదర్శన్ రెడ్డి, రఘునాథ్‌లు, ఫిజికల్ డైరక్టర్లు మహమ్మద్ హనీఫ్, ప్రశాంతి పాల్గొన్నారు.

అడిగిన వారందరికీ ఉపాధి పనులు

మద్దికెర: మండలంలో వ్యవసాయ పనులు పూర్తయిన గ్రామాలలో అడిగిన వారందరికీ మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించేందుకు చర్యలు చేపట్టామని ఏపీఓ సర్సిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం తన కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గ్రామాలలో రైతులకు కావాల్సిన పనులు గుర్తించాలని సూచించారు. పూర్తి స్థాయిలో పనులు కల్పించి కూలీలు వలస వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతు కూలీలు పనుల కోసం ఉపాధి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి

తుగ్గలి: కనీస వేతన రూ.26 వేలు ఇవ్వాలని కోరుతూ తుగ్గలిలో ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం నాయకులు సోమవారం తహసీల్దార్ రవికి వినతిపత్రం అందజేశారు. ఎన్ఎంఎంఎస్ యాప్‌తో సాంకేతిక సమస్యలు తలెత్తి కూలీల హాజరు శాతం తగ్గుతోందన్నారు. కనీస వేతనం చెల్లించడంతో పాటు, మ్యాన్‌డేస్ టార్గెట్ విధానం రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. సంఘం నాయకులు రాజు నాయక్, సందీప్‌కుమార్, సుంకప్ప, రాజు, శేఖర రెడ్డి, బాలు, మునిస్వామి పాల్గొన్నారు.

ఐసా నూతన కమిటీ ఎన్నిక

నందవరం: ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) మండల నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఐసా జిల్లా కార్యదర్శి నాగార్జున, జిల్లా ఉపాధ్యక్షుడు రాజు అధ్యక్షతన ఎంపిక చేశారు. మండలాధ్యక్షుడిగా రాజు, కార్యదర్శిగా యశ్వంత్, ఉపాధ్యక్షులుగా శాలేము, పౌలు, సహాయ కార్యదర్శులుగా రాజు, జయదేవ్, నానిలను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అలాగే ఈ నెల 12, 13 తేదీల్లో కర్నూలులో జరిగే జిల్లా మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీరు



మిద్దెతండ వద్ద పైపులైన్ ఏర్పాటు పనులు చేస్తున్న దృశ్యం

తుగ్గలి: పంచాయతీ పరిధిలో ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే లక్ష్యమని సర్పంచ్ బనావత్ లక్ష్మి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నారాయణనాయక్ అన్నారు. జలజీవన్ మిషన్ కింద పంచాయతీకి మంజూరైన నిధులతో మిద్దెతండా, చిగుర్లగుట్టతండా వద్ద చేపట్టిన పైపులైన్ పనులను వారు సోమవారం ప్రారంభించారు. జలజీవన్ మిషన్ కింద చిగుర్లగుట్ట పంచాయతీకి మొత్తం రూ.89.70 లక్షలు మంజూరైందన్నారు. ఈ నిధులతో ప్రతి ఇంటికీ కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తామని చెప్పారు. మాజీ ఎంపీపీ నారాయణ నాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణానాయక్, వెంకటేష్‌నాయక్ పాల్గొన్నారు.

మద్దికెర: సాయినగర్, రాంనగర్ కాలనీలలో ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు చేసి తాగునీటి సమస్య పరిష్కరిస్తామని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి అన్నారు. ఆయా కాలనీలు ఏర్పడినప్పటి నుంచి స్థానికులు నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత పాలకులు వారిని నిర్లక్ష్యం చేశారని, వైఎస్సార్‌సీపీ హయాంలో జలజీవన్ మిషన్ కింద త్వరలో పనులు పూర్తి చేసి నీటిని సరఫరా చేస్తామన్నారు. ఇప్పటికే ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం చేపట్టామని పైపులైన్ల పనులు పూర్తి చేసి కాలనీలకు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



బుక్కాపురంలో ప్రకృతి వ్యవసాయి సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

వెల్దుర్తి(కృష్ణగిరి): మండలంలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కొనసాగుతోంది. సోమవారం మండల పరిధిలోని బుక్కాపురం, మదార్‌పురంలలో ఇన్‌చార్జ్‌లు చంద్రమౌళి, గోపాల్ ఆధ్వర్యంలో సచివాలయాల వద్ద కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై అవగాహన కల్పించారు. పలువురికి హెల్త్ కార్డులు, అంగన్‌వాడీ సంపూర్ణ పోషణ కిట్లు అందించారు. బుక్కాపురంలో ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ముగ్గు రూపంలో కల్పించిన అవగాహన ప్రదర్శన ఆకట్టుకుంది. సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కృష్ణగిరి: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈఓఆర్డీ మురళీమోహన్ కోరారు. మండల పరిధిలోని పోతుగల్లు, ఆగవేలి గ్రామాల్లో సోమవారం ఆయా గ్రామాల సర్పంచ్‌లు తెలుగు వాణిశ్రీ, కురువ అంజినమ్మ ఆధ్వర్యంలో జరిగిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉజ్వల యోజన, ఆయుష్మాన్ భారత్, తదితర పథకాలపై అవగాహన కల్పించారు. ప్రజలకు ఆయుష్మాన్ భారత్ కార్డులను పంపిణీ చేశారు. వైద్యాధికారి ప్రదీప్, ఏఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలు తగదు

చిప్పగిరి: ఆలూరు నియోజకవర్గ అభివృద్ధికి నిజాయితీగా పనిచేస్తున్న కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని వైస్ ఎంపీపీ నరసింహులు హెచ్చరించారు. సోమవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తుండడంతో కొందరు పనిగట్టుకొని మంత్రి ప్రతిష్ట దిగజార్చేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అల్లర్లు రేపే ప్రయత్నం చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. నాయకులు హనుమంతు, హనుమన్న, తదితరులు పాల్గొన్నారు.

కన్నడ, ఉర్దూకు అవకాశం కల్పించాలి

హొళగుంద: సీబీఎస్‌ఈలో సెకండ్ లాంగ్వేజ్ కింద కన్నడ, ఉర్దూకు అవకాశం కల్పించాలని కర్ణాటక నవ నిర్మాణ సేన రాష్ట్రాధ్యక్షుడు భీమశంకర్ పాటిల్ డిమాండ్ చేశారు. ఆయన సోమవారం కార్యదర్శి విజయ్‌కుమార్, బళ్లారి జిల్లాధ్యక్షుడు కీర్తికుమార్, నగరధ్యక్షుడు యువరాజు తదితరులతో కలిసి హొళగుంద జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం నజీర్ అహమ్మద్‌ను కలిసి మాట్లాడారు. సీబీఎస్‌ఈలో కన్నడ, ఉర్దూ మీడియం కొనసాగించకపోవడం పట్ల ఆ విద్యార్థులకు ఎదురయ్యే ఇబ్బందులు వివరించారు. కన్నడ, ఉర్దూ విద్యార్థులకు న్యాయం చేసే వరకు తమ పోరాటం కొనసాగిస్తామన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

హొళగుంద: గజ్జహళ్లి గ్రామంలో ఓ వ్యక్తి కర్ణాటక నుంచి ఆంధ్రాకు అక్రమంగా తీసుకొచ్చి విక్రయించేందుకు ఉంచుకున్న మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు సోమవారం విలేకరులకు తెలిపారు. విక్రేత పరారీ కాగా 90 మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

దివ్యాంగులకు పరికరాలు

హొళగుంద: దివ్యాంగులకు అవసరమైన పరికరాలను ఉచితంగా అందజేసేందుకు ఈ నెల 14న స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుభాషిణి, పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ సోమవారం తెలిపారు. అర్హులైన దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లు 14న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే శిబిరానికి సదరం సరిఫికెట్లు, ఇతర ధ్రువ పత్రాలను వెంట తీసుకురావాలన్నారు.

ఆటో దగ్ధం



వెల్దుర్తి(కృష్ణగిరి): స్థానిక పాత బస్టాండ్ సమీపంలోని సంత మార్కెట్ వద్ద సోమవారం రాత్రి ఆటో మంటల్లో కాలిపోయింది. ప్రయాణికులను తరలించే టాటా మ్యాజిక్ ఆటోను స్థానిక ఆటో స్టాండ్‌లో నిలిపి ఉంచారు. కొద్దిసేపటికి ఆటో నుంచి మంటలు చెలరేగాయి. అక్కడున్న వారు మంటలను అదుపుచేసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

చిప్పగిరి: రబీలో రైతులు సాగు చేసిన పంటల వివరాలను తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని ఏఓ విజయలక్ష్మి సూచించారు. సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. రైతులు ఆయా గ్రామాల రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి పట్టాదార్ పాసు పుస్తకం, బ్యాంకు ఖాతా నంబరు, ఆధార్ కార్డుతో పంట నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం రైతులకు అందించే పథకాలకు పంటల నమోదే ప్రామాణికంగా ఉంటుందని చెప్పారు. ఏఈఓ రమాదేవి, ఎంపీఈఓ రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



ములుగుందంలో నీటి కోసం మినీ ట్యాంకుల వద్దకు బిందెలతో వచ్చిన గ్రామస్తులు

ఆస్పరి: మండలంలోని ములుగుందం గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు. గ్రామానికి నీటిని సరఫరా చేసే బోర్లలో ఒక్కటి మాత్రమే పని చేస్తోందని, ఆ నీరు ఏమాత్రం సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా అధికారులు ప్రస్తుతం పనిచేస్తున్న బోరు నీరు ఒకే కాలనీకి మాత్రమే సరఫరా అయ్యేలా పైపులైన్లు వేశారని, మిగతా కాలనీలకు పైపులైన్లు వేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. నెల రోజులు నుంచి మంచి నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నా అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తమ గ్రామంలో నెలకొన్న మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

హత్యాయత్నం కేసులో 12 మంది అరెస్ట్

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని పార్లపల్లి గ్రామానికి చెందిన ఎరుకుల నరసింహులుపై హత్యాయత్నం చేసిన కేసులో 12 మందిని అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్‌ఐ సి.శరత్‌కుమార్‌రెడ్డి సోమవారం సాయంత్రం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 7వ తేదీ రాత్రి పార్లపల్లి గ్రామానికి చెందిన నరసింహులుపై ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన 12 మంది దాడి చేసినట్లు చెప్పారు. పందుల దొంగతనంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తాడనే భయంతో పట్టణానికి చెందిన ఎరుకుల భీమన్న, రంగన్న, బుల్లి నాగరాజు, హరి, మారెన్న, రంగన్న, రాజేష్, నాగరాజు, సుంకన్న, పరుశురాం, మహేంద్ర, వీరేంద్రలు కలిసి నరసింహులుపై దాడికి పాల్పడినట్లు చెప్పారు. ఈ కేసులో 12 మందని అరెస్ట్ చేసి జడ్జి ముందు హాజరుపరచగా రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వైఎస్సార్‌సీపీతోనే ప్రజా సంక్షేమం



ఎమ్మిగనూరులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే బడుగులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఉదయం పట్టణంలోని 17వ వార్డు పరిధిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఇచ్చిన హామీ మేరకు సీఎం వైఎస్ జగన్ మేనిఫెస్టోలోని పథకాలన్నీ అమలు చేశారని కొనియాడారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ సీఎం వైఎస్ జగన్ సారథ్యంలోని వైఎస్సార్‌సీపీని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. టీడీపీ ప్రభుత్వం వస్తే సంక్షేమ పథకాలు నిలిచిపోవడంతో పాటు అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. వార్డు ఇన్‌చార్జ్ రామాంజిని రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి రియాజ్‌అహమ్మద్, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, నాయకులు యుకే రాజశేఖర్, షబ్బీర్, కౌన్సిలర్లు కేశవరెడ్డి, వాహిద్, అమాన్, సుధాకర్, సోమేష్, నరసింహులు గట్టుఖాజ, రజాక్, సయ్యద్ చాంద్ తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: ప్రజల ముంగిటకే సంక్షేమ పాలనను తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని పెద్దమరివీడు గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. పంచాయతీ కార్యదర్శి రఫిక్, నాయకులు నరసన్న ఆచారి, మన్సూర్, నాగేష్, భాస్కర్ రెడ్డి, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో కప్పట్రాళ్ల బొజ్జమ్మ

దేవనకొండ: మండలంలోని బి.సెంటర్ గ్రామానికి చెందిన టీడీపీ మద్దతుదారులు ఆ పార్టీని వీడి వైఎస్సార్సీపీలోకి చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం మొత్తం 25 కుటుంబాల ప్రజలు వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కప్పట్రాళ్ల బొజ్జమ్మ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారికి బొజ్జమ్మ పార్టీ కండువాలు వేసి సాధరంగా ఆహ్వానించారు. పార్టీలోకి చేరిన వారిలో బి.సెంటర్ గ్రామం నుంచి చాకలి లింగన్న, బడేసాబ్, దస్తగిరి, షాల్మియా, ఇరామియా, చిన్న బడేసాబ్, చంద్రశేఖర్, రాముడు, నాగరాజ్‌లతో పాటు మరి కొంతమంది ఉన్నారు. ముఖ్యమంత్రి జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలోకి చేరుతున్నట్లు వారు చెప్పారు. రానున్న 2024 ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తెచ్చేలా కృషి చేయాలని కప్పట్రాళ్ల బొజ్జమ్మ పిలుపునిచ్చారు. మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు తదితరులు ఉన్నారు.